# ఆశాజ్యోతి



* రచన: కుమారి బలుసు సరళ *

ఈరోజు ఆదివారం మ్యాట్నీకి వెళదామని కబురు చేసింది కమల.

డ్రస్ చేసుకుని బయలుదేరాను, పాపాయి నా వెంట వస్తానని మారాం చేస్తోంది. ఎలాగైనా పాపాయిని అమ్మ దగ్గర దిగవిడచి, వెళ్ళదామని శతవిధాల ప్రయత్నం చేశాను, కానీ, లాభంలేకపోయింది. నన్ను పట్టుకుని విడవటంలేదు.

'నీది మరి వడమంత్రయే! వున్నది ఒక్క కూతురు! దాన్నెత్తుకుని తీసికెళ్ళటానికి ఏమయింది? అదికూడా భారమేనా?' అమ్మ నన్ను చూసి కసిరింది

'నాకు తప్పలేదు' పాపాయిని వెంటబెట్టుకుని, కమల ఇంటికి బయలుదేరాను.

కమల ముందువరండాలో ఫ్రేముకుర్చీలో కూర్చుని, ఎడమచేతితో ముఖాన్ని కప్పుకుని, దీర్ఘంగా ఆలోచిస్తోంది.

నా రాకని గమనించలేదు. అలా ఒక క్షణం నిలబడ్డాను.

కానీ పాపాయి వూరుకోలేదు. నన్ను వదలి 'కమలక్కా!' అంటూ అమాంతంగా వెళ్ళి కమలమీద పడింది.

కమల వులిక్కిపడింది. పాపాయిని చూడగానే కమలముఖం వికసించింది. రెండుచేతులతో ఒడిలోకి తీసుకుంది. కమలకి పిల్లలంటే చాలా యిష్టం. వాళ్ళతో కలిసి ఎగురుతూ, చిన్నపిల్లలా ఆడుతూ వుంటుంది. పిల్లల మధ్య ఒకపిల్లగా మెలుగుతుంది. అందులో మాపాపాయి అంటే కమలకి మరీ ప్రాణం.

పాపాయిపుట్టి నాలుగు సంవత్సరాలు దాటుతోంది. కమల తరచుగా మాఇంటికి రావటంలోగల కారణం మా పాపాయే! తను రావటానికి సావకాశంలేని టైములో పాపాయిని తనయింటికి పంపమని కబురు పెట్టుంది.

కమల ఒడిలో పాపాయిని చూడగానే నా మనస్సులో కొచ్చిన ఆలోచనకు బాధ కలిగింది. కమలకికూడా వివాహమైవుంటే ఇంతపాపకు, తనుకూడా మాతృమూర్తి అయివుండేది!

'కమలా! కాస్త ఈలోకంలోకి రావమ్మా! వచ్చి ఇంతసేపైనా నన్ను గురుతించనేలేదు మరీ!'

కమల స్వప్నలోకంనుంచి తేరుకున్నదానిలా, నావంక చూసింది. చిరునవ్వు నిండార నవ్వింది. 'రావోయి! అలా నిలబడ్డావ్?'

'తమరి ఆహ్వానాన్ని శిరసావహిస్తున్నాము. అయితే సినిమా టైమయింది! ఇంకా టాయిలెట్ ఎక్స్‌ట్రా— అవలేదేం?'

'ఈరోజు సినిమా ప్రోగ్రాం కేన్సిల్!' నిరుత్సాహంగా అంది కమల.

'అదేం? మరి నాకెందుకు కబురుపెట్టావు?' అడిగాను.

'మామూలు తంతే!'

'ఏమిటది?' అర్థంకాక ప్రశించాను.

'ఊహించలేవా? పెండ్లిచూపుల తతంగం!'

'ఓహ్! మంచిదేకదా! సినిమాపోతే పోయిందిలే!' సంతోషంగా అన్నాను.

'పిచ్చిదానా! అప్పుడే పెండ్లికుదిరినట్లు సంబరపడిపోతున్నావేమే!'

'అవునుకమలా! ఈసారి తప్పకుండా సంబంధం కుదురుతుంది చూడు' ధృడంగా అన్నాను.

కమల నవ్వింది. పాపాయినిచూచి నవ్వుతూ అంది. 'పాపాయి! నీలాగా నేనుకూడా ఒకపాపలా అయితే ఎంత బాగుండును.' తన్మయత్వంతో పాపాయిని చూస్తూ వుండిపోయింది.

ఇంతలో కమల నాన్నగారు వెంట మరొకరితో వరండాలో అడుగుపెట్టారు. కమల, నేను కుర్చీలో నుండి లేచి, లోపలిహాలులోకి వెళ్ళిపోయాము.

'కూర్చోండి అవధాన్లుగారూ!' అంటూ కమలనాన్నగారు మర్యాద చేయసాగారు.

'కమలా! ఆ వచ్చినాయన ఎవరు?' వుండబట్టలేక అడిగాను.

'ఏమోనే! నాకూ తెలియదుమరి!'

కమల నాన్నగారు మాదగ్గరికి వచ్చారు. 'కమలా! ఆ వచ్చినాయన పేరు సుబ్బావధాన్లుగారు! నిన్ను చూడటానికి వచ్చారు' అని చెప్పారు ఆయన.

నేను విస్తుపోయాను. 'ఇదేమిటి? కమల పెండ్లివారు వస్తారంది, ఈ అవధాన్లుగారు కమలని చూడటంఏమిటి?'

నా అనుమానాన్ని కమల నాన్నగారు నాముఖంలో చదివారుకాబోలు! వెంటనే అన్నారు. 'ఆ వచ్చినాయన పెండ్లిండ్లు కుదుర్చుతారు!'

'థేంక్యూ, అవధాన్లుగారూ!' అనుకున్నాను మనసులో. కమలకి వివాహము ఈయన కుదిర్చితే ఎంత బాగుండును.

కమలని వెంటతీసుకుని, వరండాలోకి నడిచారు కమల నాన్నగారు.

'అమ్మాయి ఇదిగోనండి!' పరిచయం చేశారు ఆయన.

'నమస్కారమండి!' వినయంగా చేతులు జోడించింది కమల.


దీపావళి అభినందనలు




ఎల్లప్పుడూ ప్రసిద్ధిచెందిన

సరస్వతిబనియన్లనే

కొని ధరించి ఆనందించండి.

తయారించువారు

సరస్వతి బనియన్ కంపెని

తిరుపూరు-4.


'ఇలా దగ్గరికి రామ్మా! ముసలిముండాకొడుకుని. చూపు సరిగా ఆనదు' కళ్లు చిట్లించిచూశారు అవధాన్లుగారు.

'అమ్మాయి వయసు ముదిరినపిల్ల. తగినసంబంధం నా దృష్టిలో ఒకటుంది, చెప్పమంటూరా?'

'చెప్పండి అవధానులుగారూ?' అడిగారు కమల నాన్నగారు. దేముడు ప్రత్యక్షమై 'నీకేం వరంకావాలో కోర్కో?' అని అడిగినంతగా సంతోషపడుతున్నారు ఆయన.

'అలాగే చెప్తాను. ముందు నాకు వేడినీరు స్నానానికి కావాలి, పెట్టించండి' ఆజ్ఞాపించినట్టుగా అన్నారు అవధానులుగారు.

'సరేనండి! అలాగే పెట్టిస్తాను' అంటూ లోపలికి వచ్చారు కమల నాన్నగారు.

అవధానులుగార్కి కావలసిన యేర్పాట్లన్నీ చాలా జాగ్రత్తగా చేయిస్తున్నారు ఆయన.

అవధానులుగారు స్నానం, భోజనం ముగించారు. నశ్యం కాస్త దట్టించారు. గట్టిగా నాలుగుతుమ్ములు తుమ్మి, మంచంమీద జారగిలపడ్డారు. ఐదునిమిషాల తరువాత గురకలువేయటం మొదలుబెట్టారు. గాఢంగా నిద్రావస్థలోకి దిగిపోయారాయన.

కమలని అడిగాను, 'పెండ్లికొడుకుది ఏ ఊరట?'

'నాకేం తెలియదే! ఇంకా అవధానులుగారు సెలవీయలేదు సుమా!' చిరుహాసంతో అంది కమల.

నెమ్మదిగా కమల నాన్నగారిదగ్గరికి చేరాను.

'బాబాయిగారూ! వరుని వివరాలేమిటి?' ఆత్రుతగా అడిగాను.

'ఏమో! నాకు యింకా తెలియదమ్మా! అవధానులుగారు ఇంకా వివరాలు తెలుపలేదుగా?'

'అదేమిటి? వివరాలు తెలుసుకోకుండా సంబంధం ఎలా మాట్లాడుతున్నారు?'

'సంబంధం మాట్లాడటమంటే...అంత తేలికా? ఆయన మనింటికి వచ్చినందుకు ఫీజు ముప్ఫయి రూపాయిలు ఇచ్చాను. ఆడబ్బు ఆయనచేతిలో పడినతర్వాతనే బయలుదేరివచ్చారు.'

'హతోస్మి! యిలాంటి బేరగాళ్ళుకూడా వున్నారా?' ఆశ్చర్యపోయాను.

'పిచ్చితల్లీ! యింట్లో కూర్చున్నవాళ్ళకి మీకేం తెలుస్తుందమ్మా?' జాలి, బాధల మిళితకంఠంతో పలికారాయన.

అవధానులుగారు నిద్రనుండిలేచారు. పెద్ద ఆవలింతలో కమల నాన్నగార్ని పిలిచారు.

కాఫీమర్యాదలు పూర్తయ్యాయి. తాంబూలం నోట్లో

పెట్టుమని, చేతి సంచిలోనున్న పెద్ద కాతాపుస్తకం లాంటిదాన్ని తెరిచారు. చాలా పేజీలను వెనుకకు, ముందుకుత్రిప్పి చూస్తున్నారు. ఒక కాగితంమీద ఆయన దృష్టి నిలిచింది.

'ఏమండోయ్! మీ అమ్మాయి అదృష్టవంతురాలు సుమండీ! మంచిసంబంధం! నాకళ్ళబడింది' పొలికేక పెట్టినంతగా అరిచారు అవధానులుగారు.

కమల నాన్నగారు ముఖంనిండా సంతోషం గంతులు వేస్తోంది.

'ఆసంబంధం వివరాలు చెప్పండి?' ఆత్రుతను ఆపుకోలేక పోతున్నారాయన.

'వరునిది తెనాలి. ఎమ్. ఏ. చదివి, గుంటూరు కాలేజిలో ఇంగ్లీషు లెక్చరర్ గా పనిచేస్తున్నాడు.'

'అవధానులుగారూ! మేమిచ్చేకట్నానికి అందుతాడంటారా?' ఆతురతపడ్తున్నారు కమల నాన్నగారు.

'ఫర్వాలేదయ్యా, అసలు కట్నాన్ని 'వద్దు'అన్నాడు!'

'నిజమా?'

'అవును. మంచిపిల్ల దొరికితే చాలన్నాడు. ఇల్లు చక్కబెట్టే నేర్పరయితే చాలట. పెద్దగా చదువుకోకపోయినా పర్వాలేదన్నాడయ్యా!'

'చాలా సంతోషము అవధానులుగారూ! ఎలాగైనా యీ సంబంధాన్ని ఖాయపర్చండి. మీఋణాన్ని తీర్చుకుంటాను. చచ్చి మీకడుపున పుడ్తాను.' కమల నాన్నగారి కన్నులవెంట ఆనందభాష్పాలు కారుతున్నాయి.

'పిల్లవాడు మంచివాడేనా?' తిరిగి అడిగారాయన.

'పిల్లవాడేమిటయ్యా? ఆ పెండ్లికొడుకకి ముగ్గురు పిల్లలుంటేనూ!' కమలనాన్నగారు అదిరిపడ్డారు.

'అవధానులుగారూ! ముగ్గురుపిల్లల తండ్రినా మీరు చెప్పేది?' కమల నాన్నగారిహృదయం ఆవేశంతో ఎగిరిపడుతోంది.

'అవునయ్యా, చౌదరిగారూ! ఎందుకలా ఎగిరిపడ్తావు? ఈరోజుల్లో 'ఇద్దరు లేక ముగ్గురు' అని మనప్రభుత్వము ఘోషిస్తోంది గదటండీ! ఆ ముగ్గురికంటే యింక మరి పుట్టరు!'

అయోమయంగా వుంది కమల నాన్నగారి పరిస్థితి! 'ముగ్గురికంటే యింక మరి పుట్టరా? అదేమిటి అవధానులుగారూ! నాకేం అర్థం కావటంలేదు!'

'ఇందులో అర్థమయ్యేదేముందయ్యా! ముగ్గురుపిల్లలు పుట్టగానే లెక్చరర్ గారు ఆపరేషన్ చేయించుకుని 'కుటుంబనియంత్రణ అవలంబించారయ్యా. ఈ కాలంలో అందరూ చేస్తున్న పనేగా యిది!' తేల్చిగా నాన్చి చెప్పారు అవధానులుగారు.

'అవధానులుగారూ! మీకు ఆడపిల్లలు లేరూ? యిలాంటిసంబంధమా మీరు నాకు చెప్పేది? మా అమ్మాయిని గొడ్డాలుగా చేద్దామనుకుంటున్నారా? మీకు నోరెలా వచ్చింది? ముందు బయటికి నడవండి' కోపంతో మండిపడుతున్నారు కమల నాన్నగారు.

'ఎందుకయ్యా చౌదరిగారూ! అంతకోపం? నామాట విను. నిదానమే ప్రధానమన్నారు పెద్దలు! మంచి సంబంధం! వరుడా బుద్ధిమంతుడు! కావనకు, నిముషంలో కుదుర్చుకవస్తాను.'

'వీల్లేదు. మా అమ్మాయిని యిలాంటి సంబంధానికెంతమాత్రం యివ్వను. ముందు మీరు మర్యాదగా వెళ్ళండి. లేకపోతే ఏమిచేస్తానో నాకే తెలియదు.




Wanted agents to sell our nizam lady tobacco 25 paise packets in all taluks of Andhra Pradesh.

Please contact for terms and conditions:

NIZAM TOBACCO FACTORY
A. M. ABDUL RAHIMAN ROWTHER & CO.,
P. B. No. 4, PUDUKKOTTAI
(Tamilnadu)

ముందు పోండి బయటికి!' అవధానులుగారిని త్రోసేసి వంతపని చేశారు కమల నాన్నగారు.

'ఏమిటయ్యో? మా యెగిరిపడుతున్నావు? నువిచ్చేకట్నమో? ముష్టి పదివేలు! పదివేలుకే కాలేజీలో చదువు చెప్పేవాడొస్తాడా? ఏదో ఆయనకి భార్య చనిపోబట్టి గానీ... లేకపోతే నువ్విచ్చేకట్నం ఎమూలకొస్తుందంట! అక్షరమ్ముక్క రానివాడికికూడా యిస్తున్నారు పదివేలు' ఈసడించినట్టుగా మాట్లాడుతున్నారు అవధానులు.

అప్పటివరకు వాగ్వివాదం నాతోపాటు వింటున్న కమల వరండాలోకి వెళ్ళింది. 'అవధానులుగారూ! అలా తొప్ప తెచ్చుకోకండి. ఆ పెండ్లికొడుకునే మాట్లాడి రండి. వివాహమాడటానికి నేను సిద్ధంగా వున్నాను' కమల రుద్ధకంఠంతో పలికింది.

'కమలా! ఏమిటమ్మా ఆమాటలు? ముందు నువ్వు లోపలికివెళ్లు,' కమలనాన్నగారు వ్యథతోకూడిన కంఠంతో అన్నారు.

'అవును నాన్న! అవధానులుగారు చెప్పినమాట నిజం! మన మిచ్చేకట్నానికి పెండ్లికొడుకులు దొరకటం కష్టం! అందుకే ఈ లెక్చరర్‌ని వివాహమాడటానికి అంగీకరిస్తున్నాను.'

'అయితే...అయితే...నువ్వు తల్లివి కావటానికి వీలు కాదమ్మా! అయినా యిష్టమా?'

'అంతా విన్నాను నాన్నగారూ! నా ష్టమే!'

'కమలా! ఏ ఆడపిల్లా యిలాంటి సంబంధానికి కోరి ఒప్పుకోదమ్మా!' తల్లిని కావాలనే కోరుకుంటుంది.'

'పోనీలే నాన్న! తల్లిని కాకపోవటమనే ప్రశ్నే లేదుగా! ముగ్గురిపిల్లలతండ్రిని వివాహమాడినప్పుడు .. ముగ్గురిపిల్లలకి తల్లి నవుతానుకదా!'

'కమలా! నీకేమైనా పిచ్చిపట్టిందా?'

'లేదునాన్న! మాతృహీనులైన ఆ ముగ్గురిపిల్లలకు... తల్లిప్రేమకు లోటురానివ్వను; వారిని నా కన్నపిల్లలు గానే భావిస్తాను. కాదనకండి నాన్న!'

'కమలా! నీకు మతిపోయిందమ్మా! నాలాంటి సామాన్య కుటుంబీకునికి పుట్టటమే నువ్వు చేసిన నేరం! నీకు తగిన సంబంధాన్ని తేలేక కుమిలిపోతున్నానమ్మా! నన్ను మన్నించు.' ఏడుస్తున్నారాయన తేలకని కమల నాన్నగారు నాతో ప్రాధేయపూర్వకంగా అన్నారు.

'కమలకి నీవైనా చెప్పమ్మా! యీ సంబంధాన్ని చేసుకోకుండా చూడు తల్లీ!'

నెమ్మదిగా కమలదగ్గరికి సమీపించాను. భుజంమీద చేతులువేసి, నావైపుకి త్రిప్పుకుని అడిగాను. 'కమలా! వివాహం నూరేళ్ళపంట! ఒక్కనాటిది కాదిది! వెనుక, ముందు ఆలోచించుకోకుండా నిర్ణయాన్ని చేసుకోకు.'

'లేదు. అలాచేయను. నువ్వు భాగ్యవంతుల బిడ్డవి. వేలకివేలు కట్నాన్నిపోసి, వివాహం చేసుకున్నావు ఒకొక్కరిని తొమ్మిదినెలలుమోసి, ఒకపాపని, ఇద్దరు బాబుల్ని కన్నావు. కానీ, నేను కట్నాన్ని ఆశించని వారిని పెండ్లాడి, ఏబరువు, భారము మోయకుండా ముగ్గురిపిల్లలకి తల్లినవుతానంటే కాదంటున్నావా? చెప్పవే! చెప్పు. సామాన్యకుటుంబాల్లో పుట్టిన ఆడపిల్లల అదృష్టమే యిది! కాదనకుమరి!' గంభీరంగా, దృఢంగా పలికిన కమలమాటలకి ఎదురు చెప్పలేకపోయాను. కమల మాటలలోని గూఢార్థం నన్ను బాధించింది.

'కమలా! నీ నిర్ణయాన్ని మార్చుకోవూ?'

'క్షమించు, మార్చుకోలేను.'

'కమలా! వద్దమ్మా! ఈసంబంధానికి నేనెంతమాత్రం నిన్ను యివ్వను. ఈవివాహం జరుగనివ్వను. తండ్రిగా నామాటని కాదనకు'- వ్యాకులపాటుతో బ్రతిమలాడుతున్నారు కమలనాన్నగారు.

'నాన్నగారూ! నా వివాహప్రయత్నానికి మీ రెంత బాధపడుతున్నారో ను చూస్తూనేవున్నాను. కూతురుగ నాబాధ్యత నేను గుర్తెరిగి, మీతో సహకరించటమే నా ధ్యేయము. ఒద్దు. వన్నాపకండి, నేను సంతోషంగా ఈసంబంధానికి ఒప్పుకుంటున్నాను, మీమాటని కాద న్నానని భావించకండి.'

'అలా చెప్పమ్మా, మీనాయనకి.' అన్నారు అవధానులుగారు సంతోషంతో ముఖం చేటంత చేసుకుని.

'అవధానులుగారూ! మీరు వెళ్ళిరండి' అంది కమల.

'అలాగేనమ్మా! రేపీపాటికి సంబంధాన్ని ఖాయపర్చుకుని రానూ! అవధానులుగారంటే ఏమిటనుకున్నావ్? వేలకివేలు పెండ్లిండ్లు ఈచేతులమీదుగా జరిపించాను' మీసాలు వ్రేళ్ళతో దువ్వుతూ, అవధానులు సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

'కమలా. ఎందుకిలాచేశావు?' అడిగాను [illegible] [illegible]భరించలేక.

'ఎందుకు చేశానో అర్థం కాలేదా? తండ్రిగారిని ఇంక పెండ్లికి బాధపెట్టలేక.'

'నీనిర్ణయం ఆయన్ని మరెంత బాధపెట్టిందో తెలుసుకున్నావా?'

'తెలుసుకున్నాను, కానీ, తప్పదు.' నిశ్చయంగా పలికింది కమల.

నాకు తెలుసు. కమలనిశ్చయాన్ని మార్చటం కష్టం! ఏమిచేయలేక అశక్తురాలినై, పాపాయిని తీసుకుని యింటిదారి పట్టాను.

* * *

ఒకరోజున కమల, నేను ఆంజనేయస్వామిగుడికి వెళ్ళాము. పూజ జరిగినయనంతరము దేవాలయములోని పచ్చగన్నేరు చెట్టునీడలో కూర్చున్నాము.

నేనే వుండబట్టలేక అడిగాను. 'లగ్నాలు ఎప్పుడు పెట్టుకుంటారు?'

కమల ఆశ్చర్యపోతూ అడిగింది, 'లగ్నాలేమిటి?'

'పోవే, ఏమీ యెరుగని నంగనాచిలా! నీ వివాహం గురించి నేనడిగేది!'

'ఓహో! అదా! నా పెండ్లి కుదురుతుందనే నమ్మకంతోనే వున్నావా?'

'ఛా, ఏమిమాటలు కమలా! మరీ బొత్తిగా అలా మాట్లాడతావే? ఆ లెక్చరర్ సంబంధం కుదిరిందికదూ!'

'సంబంధమా! ఆహా, దివ్యంగా కుదిరింది.'

'అదే, లగ్నం యెప్పుడు పెట్టుకున్నారు?'

'ఆసంగతి నాకు తెలియదు. అవధానులు చెప్పలేదు.'

'విడ్డూరంగా మాట్లాడుతున్నావు, నీకు తెలియకుండా ఎలా వుంటుంది?'

'నిజమే, నాకు తెలియదు, నమ్మవే తల్లీ!'

'అవధానులు ఎప్పుడొచ్చారు? లెక్చరర్ వివాహానికి ఒప్పుకున్నారా?'

'రేపీపాటికి కుదుర్చుకొస్తానన్న అవధానులు వారం రోజులుకిగాని అయిపులేరు. వచ్చిచెప్పారు.'

'ఏమని?' కుతూహలంగా అడిగాను.

'వివాహం కుదిరింది' అని నవ్వుతూ చెప్పింది.

'విపులంగా చెప్పవే! వెధవ సస్పెన్సు, నువ్వూను,' విసుగ్గా అడిగాను.

'అయితే చెబుతా విను. లెక్చరర్ గారు ఇరవై వేల కట్నంతో మరొకమ్మాయిని వివాహం చేసుకోబోతున్నారు.'

'కమలా!' పిడుగు పడ్డంతగా అరిచాను.

'అవును, ఎందుకలా యిదవుతావు? వేరొక ఆడపిల్లకు వివాహం కుదిరినందుకు సంతోషించక!' కమల ఆదోలా అంది.

'కమలా! ఎందుకిలా జరిగింది? అవధానులు కుదుర్చుతానన్నారుగా?'

'అవధానులకి పెండ్లి బహుమానము మేమివ్వలేముగా మరి.'

'అదేమిటి? కట్నాలివ్వలేక చస్తుంటే, మధ్యవర్తులకి పెండ్లిబహుమానాలు కూడానా! ఆశ్చర్యమేసింది నాకు.

'సంబంధాన్ని కుదిర్చినందుకు వెయ్యినూట పదహార్లు అవధానుల కిస్తానన్నారట అవతల అమ్మాయి తండ్రి.'

'ఓ భగవాన్, ఎంతఘోరం? కట్నపిశాచం సంఘంలో ఎంతగా వీరవిహారం చేస్తోంది! మాతృమూర్తి ఆదేయ విధానంలేని స్థానంలోకూడా ఇరవై వేల కట్నమిచ్చి



Trade Mark
Regd. No. 143922

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు

ప్రతి పేనాలకు సరిపోవు....

# సర్జన్ ఇంక్

ఎల్లప్పుడూ వాడి మీ పేనాలను శుభ్రపరచుకోండి.

తయారించువారు

P. B. No. 424 Phone : 556

SURGEON INK ~~MFG Co.~~, FACTORY

BAKIYATH ST., : : VELLORE (N.A.)

BAKHIYATH

వివాహానికి సిద్ధమవటమా? పైగా అవధానులకి బహుమానాలూనా? ఎప్పటికి మారుతుంది సమాజం? వరకట్నానికి సమాధి ఎప్పుడు కడతారు?' నాలో నేను ఆవేశపడుతున్నాను.

కమల నన్ను చూచి నిర్లిప్తంగా అంది. 'ఆ అమ్మాయి తండ్రికూడా సంబంధాలకి తిరిగి, తిరిగి విసుగెత్తి చివరకి అవధానులతో సంప్రతించారట.'

'ఓహో! అలాగా!'

'అవధానులు నాగురించి చెప్పగానే, ఆ లెక్చరర్ నన్ను వివాహమాడటానికి అంగీకరించారట.'

'మరి?' అర్థోక్తిలో ఆపాను.

'ఈలోపుగా అవతలి వధువు తండ్రి రావటంతో, అవధానులకి చాన్సు దొరికింది. తనకి వెయ్యినూటపదహార్లిస్తే సంబంధాన్ని ఖాయపరుస్తానని మాటిచ్చారట!'

'ఎలా?'

'ఎలాగేమిటీ, నీకేమింకా? అవధానులు మా సంబంధాన్నిగురించి సద్భావాన్ని ప్రకటించకుండా, ఆ వధువుతోనే చేసుకోవాలని నిర్బంధించారట! లెక్చరర్ అంగీకరించారు.'

'అవును, ఎవరు కంగీకరించరు? ఇరవై వేలు ఆ స్త్రీతో కన్య వస్తుంటే!' కసిగా అన్నాను.

'కానీ, ఆతండ్రి ఎంతగా బాధపడ్డారో? ఆవధువు తన ఆశయాల సుస్వరూపాన్ని కాంచలేనివ్యథతో ఎంతగా కుమిలిపోయిందో? పాపం! పరిస్థితులయి చేయిస్తాయ్!' కమల సమర్థించింది.

'కమలా! నీకిలా అన్యాయం జరిగినందుకు నీకు బాధగా లేదూ?' అడిగాను.

'బాధా! ఎందుకు? యీమాత్రానికే! జీవితం ముళ్ళబాటలాంటిది. దానిని ఛేదించుకుంటూ ముందుకుపోవాలి, పోవాలి...అంతే యిలాంటివన్నీ తప్పవు.'

'చీకటి పడిందిగదాని ఊరుకుంటున్నామా? వెలుగు కోసం జ్యోతిని వెలిగించుకుంటున్నాముగదా! అలాగే నాహృదయంలో ఆశాజ్యోతులు మిణుకుమిణుకు మంటున్నాయి.' అంటూ ఇంటికి దారితీసింది.

కమల మాటలకి ఆశ్చర్యపోయాను. ఆమెని అర్థం చేసుకోలేకపోతున్నాను. నిజమే! కమల నాకర్థం కావటంలేదు!

(వినయ సాహితీ సమితినుండి)

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు




వీనస్ నిట్టింగ్ కంపెని
తిరుపూరు (S. I.)

కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
[స్థాపితము 1933]
విడి ప్రతి ... 25 పై.
సంవత్సర చందా ... రూ. 5-00
(ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గిన్ బాథమ్స్, స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్స్‌లోనూ దొరకును.